
సాక్షి
గుంటూరు
సోమవారం । 23 । జూన్ । 2025



వాహన తనిఖీలు

నకరికల్లు: స్థానిక వై జంక్షన్ వద్ద కారంపూడి రోడ్డులో ఎస్ఐ చల్లా సురేష్ ఆదివారం వాహన తనిఖీలు నిర్వహించారు. పత్రాలు లేని 12 మందిపై కేసులు నమోదు చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటి మట్టం ఆదివారం 514.30 అడుగుల వద్ద ఉంది. ఇది 139.0872 టీఎంసీలకు సమానం.

ఆషాఢ ఉత్సవాలు



దుగ్గిరాల: దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరు గ్రామంలోని శ్రీ మహంకాళి ఆలయంలో ఆషాఢం సందర్భంగా జూన్ 29న నిమ్మకాయల దండలతో, జూలై 6న గాజులతో అలంకారం చేయనున్నారు.

కూటమి సవతి తల్లి ప్రేమ

- పల్నాడు జిల్లాలోని పాఠశాలలకు ఎంటీఎస్ ఉపాధ్యాయులను పంపేందుకు విద్యాశాఖ ప్రయత్నం
- డీఈవో కార్యాలయంలో బదిలీల కౌన్సెలింగ్ బాయ్‌కాట్
- సొంత మండలాల్లోనే పోస్టింగ్ ఇవ్వాలని డిమాండ్
- 1998, 2008 డీఎస్సీ క్వాలిఫైడ్స్‌కు ఎంటీఎస్ ప్రాతిపదికన నియామకాలు కల్పించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 339 మంది టీచర్లు



డీఈవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఎంటీఎస్ ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో మినిమం టైం స్కేల్ (ఎంటీఎస్) పద్ధతిపై పని చేస్తున్న ఉపాధ్యాయులు పోరుబాట పట్టారు. బదిలీల్లో అన్యాయాన్ని నిలదీస్తూ ఆదివారం గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 57 మండలాల్లో 339 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. బదిలీల్లో భాగంగా కౌన్సెలింగ్ నిమిత్తం వీరిని ఆదివారం గుంటూరులోని డీఈవో కార్యాలయానికి రావాల్సిందిగా విద్యాశాఖాధికారులు సమాచారం పంపారు. అయితే, ఇటీవల నిర్వహించిన ఉపాధ్యాయ బదిలీలతో పల్నాడు జిల్లాలోని ఏడు మండలాల పరిధిలో పోస్టులు ఖాళీ అయ్యాయి. ఎంటీఎస్ ఉపాధ్యాయులను ఆయా మండలాలకు పంపేందుకు విద్యాశాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో గుంటూరులోని డీఈవో కార్యాలయంలో డీఈవో సీవీ రేణుక అధ్యక్షతన కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాల్లో పని చేస్తున్న 1998, 2008 డీఎస్సీల క్వాలిఫైడ్స్ ఎంటీఎస్ ఉపాధ్యాయులు కార్యాలయానికి వచ్చారు. ఉన్నతాధికారుల అన్యాయాన్ని ఎండగడుతూ కౌన్సెలింగ్‌ను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించి, ఆందోళనకు దిగారు.

మానవత్వంతో ఉద్యోగాలు ఇచ్చిన జగన్

1998, 2008 డీఎస్సీల ద్వారా ఎంపికైన క్వాలిఫైడ్స్ అభ్యర్థులకు అప్పటి ప్రభుత్వాలు ఉపాధ్యాయులుగా నియామకాలు కల్పించలేదు. తమకు న్యాయం చేయాలని ఏళ్ల తరబడి ప్రభుత్వాలకు విజ్ఞప్తులు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు సైతం నిర్వహించారు. ఒక్కరూ పట్టించుకున్న పాపాన పోలేదు. గత సీఎం వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి మానవతా దృక్పథంతో నెలకు రూ.30వేల వేతనంతో ఎంటీఎస్ పద్ధతిపై ఉపాధ్యాయులుగా పోస్టింగ్స్ ఇచ్చారు.

అధికారుల వైఖరికిపై తీవ్ర నిరసన

తాజాగా ఉపాధ్యాయ బదిలీలతో పల్నాడు జిల్లాలోని మారుమూల మండలాల్లో పాఠశాలలు ఖాళీ అయ్యాయి. అక్కడకు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 57 మండలాల్లో పని చేస్తున్న ఎంటీఎస్‌లను పంపాలని తీసుకున్న నిర్ణయాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. నియామక సమయంలో వారికి సొంత మండలంలోనే పని చేసేందుకు వెసులుబాటు ఇస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు ఇచ్చింది. దీనికి విరుద్ధంగా ఒక్కో ఉపాధ్యాయుడిని 150 నుంచి 200 కిలోమీటర్ల దూరంలోని పాఠశాలలకు బదిలీపై పంపాలనే అధికారుల వైఖరిపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఒక్కొక్కరికీ 50 ఏళ్ల వయసులో ఉద్యోగం వచ్చిందని, కేవలం రూ.30వేల వేతనంతో ఇళ్లు, పిల్లలను వదిలి దూర ప్రాంతంలోని పాఠశాలకు వెళ్లి, ఏ విధంగా పని చేయాలనే ఆవేదనతో కౌన్సెలింగ్‌ను బహిష్కరించారు.

రోజూ వెళ్లడం సాధ్యమేనా ?



తక్కువ వేతనంతో ప్రతి రోజూ వందలాది కిలోమీటర్లు ప్రయాణం చేసి ఏ విధంగా ఉద్యోగం చేయాలి. 11 నెలల వేతనంతో పని చేస్తున్న మాపై ఇంత నిర్దయ తగదు. డీఎస్సీ–2025 నియామకాల కోసం ఖాళీలను బ్లాక్ చేయడం సరికాదు. రెగ్యులర్ టీచర్లతో సమానంగా మాకు వేతనాలు, అలవెన్సులు, ఇంక్రిమెంట్లు ఎటువంటి ఆర్థిక ప్రయోజనాలు లేవు.

– నాగవర్ధని, అమృతలూరు మండలం

తీవ్ర అన్యాయం



ఎంటీఎస్ పద్ధతిపై తెనాలి మండలంలో పని చేస్తున్న మమ్మల్ని పల్నాడు జిల్లాలోని మండలాల్లో రవాణా సౌకర్యం సైతం లేని పాఠశాలలకు వెళ్లమంటున్నారు. రెగ్యులర్ టీచర్లు బదిలీపై వెళ్లిన ఖాళీల్లో మమ్మల్ని పంపి చేతులు దులుపుకోవాలని భావిస్తున్నారు. ఇది తీవ్ర అన్యాయం. పాఠశాలల్లో అన్ని పనులు మాతోనే చేయించుకుంటూ, తిరిగి సొంత మండలంలో ఉండే అవకాశం లేకుండా చేస్తున్నారు.

–మధు, తెనాలి

ఎట్టకేలకు దిగి వచ్చిన అధికారులు

ఎంటీఎస్ ఉపాధ్యాయులు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు దిగడంతో దిగొచ్చిన విద్యాశాఖాధికారులు ఆదివారం సాయంత్రం 4.00 గంటల సమయంలో కౌన్సెలింగ్ ప్రారంభించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో బ్లాక్ చేసిన ఖాళీలను ఓపెన్ చేశారు. 339 మంది ఉపాధ్యాయులకు 620 ఖాళీలను ప్రదర్శించి, కౌన్సెలింగ్ ప్రారంభించారు.

బాధించడం తగదు



1998 డీఎస్సీలో క్వాలిఫైడ్ అయినప్పటికీ పోస్టింగ్ కోసం దశాబ్దాలుగా ఎదురు చూసిన తరువాత గత ప్రభుత్వంలో ఇచ్చారు. ప్రస్తుతం గుంటూరు జిల్లాలో ఖాళీలు లేవని, బొల్లాపల్లి మండలం వెళ్లమని చెబుతున్నారు. నెలకు రూ.30వేల వేతనంపై పని చేస్తూ, ప్రతి రోజూ గుంటూరు నుంచి బొల్లాపల్లి వెళ్లడం సాధ్యపడుతుందా ? మరో నాలుగేళ్లలో ఉద్యోగ విరమణ పొందనున్న సమయంలో ఈ విధంగా బాధించడం తగదు.

– కటకం శారద, గుంటూరు

ఇష్టారాజ్యంగా అధికారుల తీరు



ఉమ్మడి జిల్లాలోని 57 మండలాల్లో పని చేస్తున్న 339 మంది ఎంటీఎస్ టీచర్లను పల్నాడు జిల్లాలోని ఏడు మండలాల్లో సర్దుబాటు చేయాలని అధికారులు చూస్తున్నారు. సొంత మండలంలో పని చేసే అవకాశాన్ని దూరం చేసి, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

–ఎం. సాంబశివరావు, రేపల్లె

న్యూస్‌రీల్

ఆన్‌లైన్‌లోనూ పీజీఆర్ఎస్ అర్జీలు నమోదుకు అవకాశం

గుంటూరు వెస్ట్: ఆన్‌లైన్‌లోనూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) అర్జీలను Meekosam.ap.gov.in లోనూ నమోదు చేసుకోవచ్చని చీఫ్ గ్రీవెన్స్ అధికారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీ స్టేటస్‌ను 1100 నంబర్‌కు నేరుగా ఫోన్ చేసి తెలుసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. సోమవారం యథావిధిగా పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలియజేశారు.

‘ఆర్‌టీఈ’ కింద రెండవ విడతలో 73 మంది ఎంపిక

నరసరావుపేట ఈస్ట్: విద్యాహక్కు చట్టం కింద పల్నాడు జిల్లా పరిధిలో రెండవ విడత లాటరీలో 73 మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాలకు ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వి.సుబ్బారావు ఆదివారం తెలిపారు. ఎంపికైన విద్యార్థుల జాబితా మండల కార్యాలయాలలో అందుబాటులో ఉంచటంతోపాటు తల్లిదండ్రుల మొబైల్ ఫోన్‌లకు సమాచారం పంపినట్లు వివరించారు. తల్లిదండ్రులు పూర్తి ఆధారాలతో ఈ నెల 28వ తేదీలోపు ఆయా పాఠశాలల్లో సంప్రదించాలన్నారు. తమ పిల్లల ఒకటో తరగతి ప్రవేశాలను నిర్ధారించుకోవాలని సూచించారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఎంపికైన విద్యార్థుల ప్రవేశాలను తిరస్కరించరాదని స్పష్టం చేశారు. మండల విద్యాశాఖాధికారులు విద్యార్థుల ప్రవేశాలను నిర్ధారించుకొని సదరు జాబితాను ఈ నెల 28వ తేదీన డీఈఓ కార్యాలయంలో అందచేయాలని తెలిపారు.

ఆలయ నిర్మాణానికి రూ.3,00,116 విరాళం



నరసరావుపేట రూరల్: ఇస్సపాలెం మహంకాళి అమ్మవారి ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన జల్లి శ్రీనివాసరావు, చౌడేశ్వరి దంపతులు రూ.3,00,116 విరాళంగా అందజేశారు. ఆలయ కార్యాలయంలో ఆదివారం ఈవో నలబోతు మాధవీదేవిని కలిసిన దాతలు విరాళం మొత్తాన్ని అందజేశారు. కార్యక్రమంలో దాతల కుమారుడు నరేంద్రకుమార్ సతీమణి శ్రీదేవి, రెండవ కుమారుడు నాగవేణు హరికుమార్, ఆలయ అర్చకులు కొత్తలంక కార్తికేయ శర్మ, నండూరి కాశికృష్ణలు పాల్గొన్నారు. ఆలయ నిర్మాణానికి దాతలు విరాళాలు అందజేసి సహకరించాలని ఈవో కోరారు.

జూలై 4న జెడ్పీ సర్వసభ్య సమావేశం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని జూలై 4న ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి 29న సభ్యుల గైర్హాజరుతో నిరవధికంగా వాయిదా పడిన సర్వసభ్య సమావేశాన్ని తిరిగి జూలై 4న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు జెడ్పీటీసీలతో పాటు ప్రజాప్రతినిధులు, మూడు జిల్లాల్లోని ప్రభుత్వ శాఖల అధికారులకు నోటీసులు పంపారు.

జగన్మాతకు జేజేలు

- దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ
- ఆర్జిత సేవల్లో ఉభయదాతలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): భక్తజనం జగన్మాతకు జేజేలు పలికారు. నగరంలోని దుర్గగుడిలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఉదయం ఆరు గంటల నుంచే ప్రారంభమైన భక్తుల రద్దీ సాయంత్రం వరకు కొనసాగింది. సర్వ దర్శనంతో పాటు రూ. 100,రూ. 300, రూ. 500 టికెట్ల క్యూలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం కావడంతో అమ్మవారి ఆర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. లోక కల్యాణార్థం ఆదివారం ఆలయ ప్రాంగణంలో సూర్యోపాసన సేవ నిర్వహించారు. ఉభయదాతలను ప్రత్యేక క్యూలైన్ మార్గం ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు. ఉదయం 11 గంటలకు అన్ని క్యూలైన్లు కిటకిటలాడటంతో అంతరాలయ దర్శనం నిలిపివేశారు. రూ. 300 టికెట్‌పై బంగారు వాకిలి దర్శనం కల్పించగా, రూ. 100 టికెట్‌పై రెండు క్యూలైన్లు నడిచాయి. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం పల్లకీ సేవ చేశారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువైఉన్న దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి గుంటూరుకు చెందిన భక్తులు ఆదివారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. గుంటూరుకు చెందిన సాయి చరిత కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

నేడు దుర్గగుడి మాస్టర్ ప్లాన్‌పై సమీక్ష

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): దుర్గగుడి మాస్టర్‌ప్లాన్‌పై సోమవారం సమీక్ష సమావేశం జరగనుంది. మహా మండపంలోని ఏడో అంతస్తులో జరిగే సమావేశానికి దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), ఎమ్మెల్యే సుజనా చౌదరి హాజరయ్యే అవకాశాలున్నాయి. దేవస్థానంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు, మాస్టర్‌ప్లాన్ అమలుపై ఇంజినీరింగ్ అధికారులు నివేదికలు సిద్ధం చేస్తున్నారు. దసరా నాటికి మహామండపం ఎదుట అన్నదాన భవనం, ప్రసాదాల పోటులను సిద్ధం చేయడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇంజినీరింగ్ పనులు, ఇతర అభివృద్ధి పనులను ఈవో శీనానాయక్ ఇప్పటికే పలుసార్లు సమీక్షించారు. కనకదుర్గనగర్, గోశాల ఎదుట ఉన్న దుకాణాలను మహా మండపం 5వ అంతస్తులోకి తరలించే అంశం కూడా చర్చకు రానున్నట్లు తెలుస్తోంది.

కాల ‘కూటమి’ అబద్ధాల నిలదీత !

- నేడు వైఎస్సార్ సీపీ ‘యువత పోరు’
- కూటమి నిర్లక్ష్యాన్ని నిలదీయనున్న యువత
- జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన
- యువతను నిలువునా మోసగిస్తున్న కూటమి సర్కార్
- రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టనున్న వైఎస్సార్ సీపీ



కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు

పట్నంబజారు: కూటమి సర్కార్ దుర్నీతిని ఎండగట్టేందుకు ‘యువత పోరు’బాట పట్టనుంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద కూటమి సర్కార్ ఎన్నికల హామీల్లో భాగంగా ఇచ్చిన వాగ్దానాల అమలుపై నిలదీయనున్నారు. 20లక్షల ఉద్యోగాలిస్తామని, లేనిపక్షంలో రూ. 3వేల నిరుద్యోగ భృతినిస్తామని చంద్రబాబు నమ్మబలికారు. తీరా గెలిచిన తరువాత రెడ్‌బుక్ మార్క్ పాలనతో భయభ్రాంతులకు గురి చేస్తున్న నేపథ్యంలో ధ్వజమెత్తనున్నారు. ఏడాది పాలన గడిచిన నేపథ్యంలో ఒక్కొక్కరికీ రూ. 36వేలు బకాయి పడ్డావు బాబూ... అని దిక్కులు పిక్కటిల్లేలా నినదించనున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలో ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ మినహా, కొత్తగా ఏదీ విడుదల చేయలేదు. డీఎస్సీ కూడా అరకొరగా ఇచ్చింది. గ్రూప్ 2, కానిస్టేబుల్ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలోనే నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. పథకాలు అమలు చేయలేని పరిస్థితుల్లో డైవర్షన్ పాలిటిక్స్ తప్పా చేస్తోంది ఏమీ లేదనే అభిప్రాయాలు యువత నుంచి వ్యక్తమవుతున్నాయి.

యువతకు అండగా వైఎస్సార్ సీపీ

యువత జరుగుతున్న అన్యాయాన్ని నిలదీసేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ‘యువత పోరు’కు శ్రీకారం చుట్టింది. నేడు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్దకు ఉదయం 9గంటలకు చేరుకుని, ధర్నా చౌక్ వద్ద శాంతియుత వాతావరణంలో నిరసన తెలుపుతారు. అనంతరం జిల్లా ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేస్తారు. కూటమి మోసాన్ని ఎండగడుతూ స్వచ్ఛందంగా నిరసన తెలియజేసేందుకు యువజనులు పెద్దఎత్తున కార్యక్రమానికి తరలిరానున్నారు. కూటమి ప్రభుత్వ విధానాలను ఎండగట్టనున్నారు.

ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణే ధ్యేయం

ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె. బసవ లింగారావు



మాట్లాడుతున్న బసవ లింగారావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలని ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు కె. బసవ లింగారావు పిలుపునిచ్చారు. జిల్లా కోర్టు ఎదుట ఉన్న సంఘ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యవర్గ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుతున్న కాలంలో ఉపాధ్యాయులు బోధనా పద్ధతులను కూడా మార్చుకుని, తల్లిదండ్రుల అభీష్టం మేరకు వృత్తికి పునరంకితమై పని చేయాలని సూచించారు. తల్లిదండ్రుల మద్దతుతో ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుని, ఉన్నత విద్యాప్రమాణాలు నెలకొల్పేందుకు కృషి చేయాలని కోరారు. విద్యారంగానికి నష్టం చేసే సంస్కరణలను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులను ఇతర పనుల నుంచి మినహాయించి, కేవలం బోధనకే పరిమితం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థులకు అందుబాటులో ఉన్న పాఠశాలల నుంచి తరగతులను విభజించి, ఇతర చోట్లకు తరలించడం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి పాఠశాలకు కనీసం ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించాలని కోరారు. పాఠశాలల్లో అడ్మిషన్లు జరుగుతున్న సమయంలో శిక్షణ పేరుతో ఉపాధ్యాయులను పాఠశాలకు దూరం చేయడం సరైనది కాదని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు ఉపాధ్యాయ సంఘాల సూచనలు, అభిప్రాయాలను తీసుకుని ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఏపీటీఎఫ్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్ మాట్లాడుతూ బదిలీలు, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులు జూన్ వేతనాలు పొందడంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. 12వ పీఆర్సీ కమిషన్ నియమించి 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. 11వ పీఆర్సీ బకాయిలతో పాటు పెండింగ్ ఉన్న మూడు కరువు భత్యాలను ప్రకటించి పాత బకాయిలు విడుదల చేయాలని కోరారు. పీఎఫ్, ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవ్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు పి.లక్ష్మీనారాయణ, జి.దాస్, చక్కా వెంకటేశ్వరరావు, ఎస్.ఎస్.ఎన్. మూర్తి, వి.కిశోర్ షా, వివిధ మండల శాఖల బాధ్యులు టి.భాస్కర్, జహంగీర్, శ్రీనివాసరావు, శివరామకృష్ణ, బాలరాజు, వెంకటేశ్వర్రావు, కుటుంబరావు, మాలకొండయ్య, మరియరాజు, షూకూర్, రమేష్ పాల్గొన్నారు.

నిబంధనలకు పాతెర

- కారుల అద్దాలకు విచ్చలవిడిగా నల్ల ఫిల్మ్ వాడకం
- సుప్రీం కోర్టు ఆదేశాలు బేఖాతరు
- పట్టించుకోని రవాణా శాఖ, ట్రాఫిక్ అధికారులు



బ్లాక్ ఫిల్మ్‌తో ఉన్న కారు

పట్నంబజారు: కార్లు, ఇతర వాహనాల అద్దాలకు నల్ల ఫిల్మ్ వాడకాన్ని సుప్రీం కోర్టు పూర్తి నిషేధించింది. ఒక వేళ వాడినా 30 నుంచి 60శాతంలోపు మాత్రమే వినియోగించాలి. మోటార్ వెహికల్ యాక్ట్ 1989/100 ప్రకారం, సీఆర్‌పీసీ 188 ప్రకారం నలుపు రంగు ఫిల్మ్ వాడకూడదనే స్పష్టమైన నిబంధనలు ఉన్నాయి. దీంతో పాటు 20 ఏళ్ల కిందటే సుప్రీం కోర్టు కూడా దీనిపై నిషేధాజ్ఞలు జారీ చేసింది. గతంలో అనేక ఘటనలు, కిడ్నాప్‌లు, అసాంఘిక కార్యకలాపాలు జరిగిన నేపథ్యంలో సర్వోన్నత న్యాయస్థానం ఈ ఆదేశాలను వెలువరించింది. బ్లాక్ ఫిల్మ్ వినియోగిస్తే చర్యలు తీసుకోవాలని రవాణా, పోలీసు శాఖలకు బాధ్యతలు అప్పగించింది. అయితే, రెండు శాఖల అధికారులు పట్టించుకోకపోవడంతో ఇటీవల వాహనాలకు విచ్చలవిడిగా వాడుతున్నారు.

కార్లకు విచ్చలవిడిగా వినియోగం

గుంటూరు నగర పరిధిలో సుమారుగా 30వేలకు పైగా కార్లు ఉంటాయని అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. ముఖ్యంగా సొంత కార్లతో పాటు ట్రావెల్స్, మ్యాక్సీ క్యాబ్‌లు కలిపి రెండు వేలకుపైగా ఉంటాయి. వీటిలో కార్ ట్రావెల్స్ నిర్వాహకులు, సొంత కార్లు ఉన్నవారు బ్లాక్ ఫిల్మ్‌ను అధికంగా వినియోగిస్తున్నారు. బ్లాక్ ఫిల్మ్ వినియోగిస్తే తొలిసారి రూ 300 జరిమానా, తరువాత రూ. 500 వేస్తారు. మూడోసారి కూడా ఇదే విధంగా వ్యవహరిస్తే, కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచే అవకాశాలున్నాయి.

జెడ్ ప్లస్‌కు మాత్రమే అనుమతి

భద్రత ప్రమాణాల్లో భాగంగా జెడ్‌ప్లస్ కేటగిరీ ఉన్న వారికి మాత్రమే బ్లాక్ ఫిల్మ్ వినియోగించాలని సుప్రీం కోర్టు పేర్కొంది. ఆఖరికి రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర రాజకీయ పార్టీల నేతలు, ప్రముఖులు, వ్యాపారవేత్తలు సైతం బ్లాక్ ఫిల్మ్ లేని వాహనాలనే వినియోగించాలని స్పష్టంగా చెప్పింది. బ్లాక్ ఫిల్మ్ వినియోగించదలచిన వారు రాష్ట్ర హోం సెక్రటరీ అధ్వర్యంలో డీజీపీతో పాటు ఇతర ప్రముఖ అధికారులతో కూడిన కమిటీకి దరఖాస్తు చేసుకోవాలి. భద్రత ప్రమాణాల దృష్ట్యా మినహాయింపు పొందే అవకాశం ఉంది. ఇది కూడా వారి నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు వాహనాల వెనుక వైపు అద్దాలకు 70శాతం, సైడ్ గ్లాసెస్‌కు 30 నుంచి 50 శాతం మాత్రమే బ్లాక్ ఫిల్మ్ ఉండాలి. కానీ ఈ నిబంధనలను స్టిక్కరింగ్ పాయింట్లు, ప్రముఖ షోరూమ్‌ల నిర్వాహకులు పట్టించుకోకపోవడం లేదు. కార్లకు వాహనాలకు 100శాతం బ్లాక్ ఫిల్మ్‌ను వినియోగిస్తూ యథేచ్ఛగా తిరుగుతున్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఫిల్మ్‌తోపాటు గ్లాసెస్ కూడా నిర్ణీత పరిమాణాలను మించి ఉండకూడదు. వాహనాల్లోని లోపలి భాగాలు స్పష్టంగా కనిపించాలి.

కనీస తనిఖీలు ఏవీ ?

గుంటూరు నగరంలో రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (ఆర్టీఏ), ట్రాఫిక్ పోలీసులు కనీస తనిఖీలు కూడా చేపట్టడం లేదు. ఏదైనా ఘటన జరిగితే తప్పా చర్యలు తీసుకొనే పరిస్థితి లేదు. నిబంధనల ప్రకారం అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజల నుంచి అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తనిఖీలు నిర్వహించి, బ్లాక్ ఫిల్మ్ వినియోగంపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

స్పెషల్ డ్రైవ్ చేపడతాం



నగరంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టేందుకు దృష్టి సారిస్తున్నాం. బ్లాక్ ఫిల్మ్ పరిమాణాన్ని మించి వినియోగించే వారికి జరిమానాలు విధించడంతో పాటు కేసులు నమోదు చేస్తాం.

–ఎం.రమేష్, ట్రాఫిక్ డీఎస్పీ, గుంటూరు సిటీ

నగరపాలక సంస్థ ‘వీధి’ దోపిడీ

- ఐడీ కార్డ్ పేరిట వీధి వ్యాపారుల నుంచి రూ.150 వసూలు
- ఇదేం దోపిడీ అంటూ వ్యాపారుల మండిపాటు



ఐడీ కార్డులకు కట్టిన నగదుకు ఇచ్చిన రశీదు

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో స్ట్రీట్ వెండింగ్ పాలసీపై ఒక కొలిక్కి రాకుండానే వీధి వ్యాపారుల నుంచి నగరపాలక సంస్థ రూ.150 వసూలు చేస్తోంది. నగరంలోని 207 వార్డు సచివాలయాల పరిధిలోని సెక్రటరీలు వీధి వ్యాపారుల వద్దకు వెళ్లి చలానాలు కట్టాలని సూచిస్తున్నారు. ఇదేం దోపిడీ అంటూ వీధి వ్యాపారులు గత్యంతరం లేక నగరపాలక సంస్థ కార్యాలయంలో నగదు చెల్లిస్తున్నారు.

30వేలకు పైగా వీధి వ్యాపారులు

నగరంలో సుమారు 30వేలకు పైగా వీధి వ్యాపారులున్నారు. గతంలో ఇచ్చిన గుర్తింపు కార్డులను కొంత మంది దుర్వినియోగం చేశారనే కారణంతో ప్రస్తుత కమిషనర్ పులి శ్రీనివాసులు వాటిని రద్దు చేశారు. తిరిగి కొత్తగా ఐడీ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆదేశించారు. వ్యాపారాలను చెక్ చేసిన తరువాత ఐడీ కార్డులు ఇస్తామని గత సంవత్సరం నవంబర్‌లో నగరపాలక సంస్థ అధికారులు చెప్పారు. దీంతో పలువురు దరఖాస్తు చేసుకున్నారు. అయితే, ఇంత వరకూ కార్డులు ఇవ్వక పోగా, సచివాలయం వారీగా సెక్రటరీలు రూ.150 చలానా కట్టిస్తున్నారు.

స్ట్రీట్ వెండింగ్ పాలసీపై స్పష్టత కరువు

నగరపాలక సంస్థ పరిధిలో మూడు జోన్లను పట్టణ ప్రణాళిక అధికారులు ఏర్పాటు చేశారు. రెడ్‌జోన్ మినహా గ్రీన్ జోన్, అంబర్ జోన్ పరిధిలో వ్యాపారం చేసుకునే వారికి గుర్తింపు కార్డులు ఇచ్చేందుకు గత ప్రభుత్వ హయాంలోనే కార్యాచరణ సిద్ధం చేశారు. అయితే, 2022లో స్ట్రీట్ వెండింగ్ పాలసీపై కొంత మంది కోర్టును ఆశ్రయించారు. ఆశీలు వసూలు చేయకూడదని స్పష్టం చేయడంతో నగరపాలక సంస్థ నిలిపివేసింది. దీంతో గత రెండు, మూడు సంవత్సరాలుగా నగరపాలక సంస్థ టెండర్ నిర్వహించకపోవడంతో రూ.3 కోట్లు దాకా కార్పొరేషన్ ఆదాయానికి నష్టం వాటిల్లుతోంది. స్ట్రీట్ వెండింగ్ పాలసీ అమలయ్యే వరకు ఆశీలు వసూలు చేసే కార్యక్రమంపై నగరపాలక సంస్థ దృష్టి సారిస్తే కార్పొరేషన్‌కు కోట్ల రూపాయిల ఆదాయం సమకూరేది. అటు ఈ విషయంపై దృష్టి సారించక..ఇటు స్ట్రీట్ వెండింగ్ పాలసీపై స్పష్టత ఇవ్వకుండా రూ.150 వసూలు చేయడం ఎంత వరకు సమంజసమని వీధి వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు.

అక్రమ ఆక్రమణల దళం దౌర్జన్యం

నగరంలో పలు ప్రాంతాల్లో అక్రమ ఆక్రమణ దళ సిబ్బంది దౌర్జన్యం చేసి, వ్యాపారాలు జరగనివ్వకుండా చేస్తున్నారని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. మామూళ్లు ఇచ్చుకుంటే జోలికి పోవడం లేదని.. ఇవ్వకపోతే కాటాలు, ఇతర వస్తువులు తీసుకువెళుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్ట్రీట్ వెండింగ్ పాలసీపై స్పష్టత ఇచ్చి, న్యాయం చేయాలని పలువురు వ్యాపారస్తులు కోరుతున్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్ మెడికల్ కాలేజీ పనులు పూర్తి చేయాలి

డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్



పిడుగురాళ్ల: డాక్టర్ వైఎస్సార్ మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర వైద్యుల విభాగం అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం పల్నాడు హాస్పిటల్‌లోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఏకకాలంలో 17 మెడికల్ కాలేజీలను మంజూరు చేయడం గొప్ప విషయమని పేర్కొన్నారు. కళాశాలతో పల్నాడు ప్రజలకు హెల్త్ కేర్ యాక్సెస్ ప్రతి ఒక్కరికీ అందుతుందని చెప్పారు. వైద్య విద్య, ఉపాధి, అభివృద్ధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఎక్కడ ప్రమాదాలు చోటుచేసుకున్నా గుంటూరు వరకు వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని సందర్భాల్లో మార్గం మధ్యలోనే ప్రాణాలు కోల్పోవడం జరుగుతుందని గుర్తు చేశారు. ప్రస్తుతం మెడికల్ కాలేజ్ నిర్మాణ పనుల గురించి చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అధికారులతో సమీక్ష నిర్వహించి గత ప్రభుత్వంలో 30 శాతం మాత్రమే పూర్తిందనడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఆస్పత్రి అందుబాటులోకి తీసుకురాకపోతే గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డితో కలసి ప్రత్యక్ష పోరాటానికి దిగితామని డాక్టర్ అశోక్ కుమార్ హెచ్చరించారు.

ఖతార్‌లో ఉద్యోగాలకు అవకాశం

క్రోసూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ) ఖతార్ దేశంలో వెల్డర్ ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు సంస్థ జిల్లా అధికారి తమ్మాజీరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 24 నుంచి 45 సంవత్సరాలు, పురుషులు ఐటీఐ లేదా ఐటీసీ, పూర్తి చేసి 4 సంవత్సరాలు అనుభవం ఉండాలని పేర్కొన్నారు. నిబంధనల మేరకు పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ నెల 25 వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. http// naipunyam.ap.gov.in రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాల కోసం 9988853335, 8712655686, 8790118349, 8790117279 సంప్రదించాలని సూచించారు.

ప్రజల శాస్త్రవేత్త డాక్టర్ నాయుడమ్మ

- దేశంలో తోలు పరిశ్రమ అభివృద్ధికి కృషి
- నేడు 40వ వర్ధంతిని ఏఎన్‌యూలో నిర్వహిస్తున్న సందర్భంగా నివాళి

తెనాలి: పట్టణానికి చెందిన ప్రజల శాస్త్రవేత్త డాక్టర్ యలవర్తి నాయుడమ్మ 40వ వర్ధంతిని సోమవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించనున్నారు. ప్రొఫెసర్ వి.బాలమోహన్‌దాస్ సెమినార్ హాలులో ఉదయం 11 గంటలకు ఏర్పాటయే సభలో డాక్టర్ నాయుడమ్మపై రూపొందించిన సావనీరును ఆవిష్కరిస్తారు. పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.గంగాధర్‌రావు, చెన్నైలోని సీఎస్ఐఆర్–సీఎల్ఆర్ఐ ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ స్వర్ణ వి.కాంత్ పాల్గొంటారు. కార్యక్రమాన్ని యలవర్తి నాయుడమ్మ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫౌండేషన్ నిర్వహిస్తోంది.

తోలు పరిశ్రమకు సాంకేతిక పరిజ్ఞానం

తోలు శుద్ధి చేసే ప్రక్రియకు సాంకేతిక పరిజ్ఞానం జోడిస్తే పరిశ్రమకు సమస్యగా ఉన్న మకిలి మాయమైంది. కొన్ని వర్గాలకే పరిమితమైన చర్మ పరిశ్రమ అందరిదైంది. చర్మకారుల నైపుణ్యం పెరిగింది. కులాని కతీతంగా చర్మ పరిశ్రమ విస్తరించి, ఆ రంగంలోనూ దేశానికి కీర్తిని తీసుకొచ్చింది. నిశ్శబ్దంగా సాగిన ఈ విప్లవాన్ని సాధించిన ఘనత ప్రజల శాస్త్రవేత్త డాక్టర్ యలవర్తి నాయుడమ్మకు దక్కుతుంది. 'జన్మతః రైతును...వృత్తిరీత్యా అస్పృశ్యుడను' అని చెప్పుకున్న నాయుడమ్మ, తన వృత్తితో చర్మ పరిశ్రమను ఇతర పరిశ్రమలకు దీటుగా తీర్చిదిద్దారు.

గుంటూరు జిల్లా ముద్దుబిడ్డ

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అమృతలూరు మండల గ్రామం యలవర్రు డాక్టర్ నాయుడమ్మ స్వస్థలం. 1922 సెప్టెంబరు 10న జన్మించారు. దగ్గర్లోని తురుమెళ్లలో హైస్కూలు విద్య, గుంటూరు ఏసీ కాలేజీలో ఇంటర్ తర్వాత, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో కెమికల్ టెక్నాలజీలో బీఎస్సీ చేశారు. 1943లో చెన్నైలో లెదర్ టెక్నాలజీలో చేరారు. అమెరికాలోని లీహై విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ చర్మశుద్ధిపై ఎంఎస్, డాక్టరేట్ పొందారు. 1951లో తిరిగొచ్చి, చెన్నైలోని కేంద్ర చర్మ పరిశోధన సంస్థ (సీఎల్ఆర్ఐ)లో శాస్త్రవేత్తగా చేరారు. ఆ సంస్థను సాటిలేని పరిశోధన సంస్థగా రూపొందించే కృషితో 1958లో అదే సంస్థ డైరెక్టర్‌గా నియమితులయ్యారు.



డాక్టర్ యలవర్తి నాయుడమ్మ

పరిశోధనలు చర్మకారులకు వరప్రసాదాలు

నాయుడమ్మ పరిశోధనలు దేశీయ చర్మ పరిశోధనకు, చర్మకారులకు వరప్రసాదాలు. ఆయన సారథ్యంలో సీఎల్ఆర్ఐ సంస్థ, పారిశ్రామికాభివృద్ధి, గ్రామీణాభివృద్ధిలో గణనీయమైన పాత్ర వహించింది. పలు దేశాలు చర్మ సంపద సద్వినియోగానికి నాయుడమ్మ సలహాలను స్వీకరించాయి. ఐక్యరాజ్య సమితి సలహాదారుగా వివిధ దేశాల్లో తోళ్ల పరిశ్రమల అభివృద్ధికి తోడ్పడ్డారు. ఫలితంగా కేంద్ర ప్రభుత్వ శాస్త్రసాంకేతిక విషయాల శాఖ కార్యదర్శిగా, భారత విజ్ఞానశాస్త్ర పరిశోధన మండలి (సీఎస్ఐఆర్) డైరెక్టర్ జనరల్‌గా ఏకకాలంలో ఆరు సార్లు పనిచేశారు. సీఎస్ఐఆర్ డీజీ ఇతర దేశాల్లో ఉన్నతోద్యోగాల్లో ఉన్న భారతీయ శాస్త్ర సాంకేతిక నిపుణులను స్వదేశానికి రప్పించారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాన్ని రూపకల్పన చేశారు.



తోలుతో చేసిన గులాబీ పువ్వును నాటి ప్రధాని నెహ్రూకు చూపుతున్న డాక్టర్ నాయుడమ్మ

శాస్త్ర సాంకేతిక కమిటీకి రథసారథి

1980లో అభివృద్ధి చెందిన దేశాల్లోని శాస్త్ర సాంకేతిక కమిటీకి అధ్యక్షులుగా నాయుడమ్మ అనేక సృజనాత్మక పథకాలను ప్రవేశపెట్టారు. ఆసియా ఖండానికి చెందిన అసోసియేషన్ ఫర్ సైన్స్ కో–ఆపరేషన్‌కు వ్యవస్థాపక సభ్యునిగా వ్యవహరించారు. ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా, ఐక్యరాజ్యసమితి సీనియర్ సలహాదారుగా, కెనడాలోని అంతర్జాతీయ అభివృద్ధి పరిశోధన కేంద్రం గవర్నర్‌గా, సైన్స్ టెక్నాలజీ హైపర్ కమిటీ చైర్మన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గౌరవ సలహాదారుగా పనిచేశారు. చర్మవిజ్ఞానంపై 200 పరిశోధన పత్రాలు, 100 వ్యాసాలను సమర్పించారు. నాయుడమ్మ కృషికి గుర్తింపుగా భారత ప్రభుత్వ పద్మశ్రీ గౌరవం సహా ప్రతిష్టాత్మక రాజాలక్ష్మి ఫౌండేషన్ అవార్డును, పలు యూనివర్సిటీల గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. 1985లో జూన్ 23న ఆయన ప్రయాణిస్తున్న ఎంపరర్ కనిష్క–బోయింగ్ 747 విమానం బాంబు పేలుడుకు గురై పేలిపోయింది. దేశం ఒక మహోన్నత శాస్త్రవేత్తను కోల్పోయింది.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై పోరు

- ఆగస్టు 8న 'చలో విజయవాడ'
- యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ పిలుపు

లక్ష్మీపురం: విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కారానికి ఆగస్ట్ 8న నిర్వహించనున్న 'చలో విజయవాడ' విజయవాడను జయప్రదం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.వి. నాగేశ్వరరావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొజ్జ సుమన్ పిలుపునిచ్చారు. గుంటూరు సీఐటీయూ జిల్లా కార్యాలయంలో యూనియన్ ఆఫీస్ బేరర్స్ సమావేశాన్ని సీఐటీయూ నాయకులు జల్లెడ రాజశేఖర్ అధ్యక్షతను ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో రెండు శతాబ్దాలుగా వెట్టి చాకిరి చేస్తున్నకాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. 10,15 సంవత్సరాలు వాచ్‌మెన్స్‌గా చేసి షిఫ్ట్ ఆపరేటర్లుగా చేరిన కార్మికులకు పాత విధానంలో వేతనాలు చెల్లించాలని కోరారు. మీటర్ రీడర్స్, స్టోర్ హమాలీస్, బిల్ కలెక్షన్ ఏజంట్స్‌లకు ఉద్యోగ భద్రత కల్పించి వారికి కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగులో ఉన్న కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. నూతనంగా చేరిన కార్మికులకు పాత కార్మికులతో సమానంగా వేతనాలు చెల్లించాలని,అర్హులైన కార్మికులకు షిఫ్ట్ ఆపరేటర్ పోస్ట్‌లకు అవకాశం కల్పించాలనే డిమాండ్స్‌తో న్యాయమైన పోరాటం చేస్తున్నామని తెలిపారు. 'చలో విజయవాడ'లో ప్రతి విద్యుత్ కార్మికుడు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ముజఫర్ అహ్మద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు, జి. నాగరాజు, నాయకులు పవన్, రాంబాబు పాల్గొన్నారు.

ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితులు నేడే ఎక్కువ

పూర్వ విప్లవ విద్యార్థుల వేదిక రాష్ట్ర కన్వీనర్ భరద్వాజ

గుంటూరు ఎడ్యుకేషన్: దేశంలో యాభై ఏళ్ల కిందట నెలకొన్న పరిస్థితులతో పోల్చితే ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఇప్పుడే ఎంతో ఉందని పూర్వ విప్లవ విద్యార్థి వేదిక రాష్ట్ర కన్వీనర్ భరద్వాజ పేర్కొన్నారు. ఆదివారం గుంటూరు మెడికల్ కళాశాల ఎదుట ఉన్న ఎన్జీవో కల్యాణ మండపంలో యాభై ఏళ్ల విప్లవ విద్యార్థి ఉద్యమ ప్రస్థానం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నవజ్యోతి అధ్యక్షతన జరిగిన సదస్సులో భరద్వాజ మాట్లాడారు. మావోయిస్టులు శాంతి చర్చలకు ముందుకు వచ్చినా కేంద్రం వారిని అంతం చేయడమే లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. గతంలో వైఎస్. రాజశేఖర్ రెడ్డి పాలనలో మావోయిస్టులతో చర్చలు జరిపి, వారిని జనజీవన స్రవంతిలోకి ఆహ్వానించారని గుర్తు చేశారు. ఎల్‌టీటీఈతో పాటు అనేక వేర్పాటువాద ఉద్యమాలు నిర్వహించిన సంస్థలతో సైతం చర్చలు జరిపిన ప్రభుత్వాలు ప్రస్తుతం మావోయిస్టులతో చర్చలకు అంగీకరించేది లేదని చెప్పడం వెనుక కార్పొరేట్ సంస్థల ఒత్తిడి కారణమని పేర్కొన్నారు. వీక్షణం పత్రిక సంపాదకుడు వేణుగోపాల్ మాట్లాడుతూ యాభై ఏళ్ల వామపక్ష విద్యార్థి ఉద్యమ ప్రస్థాన యాత్రలో సాధించిన ఎన్నో విజయాలను తెలియజేశారు. ఇప్పటికీ రాడికల్స్ ప్రజల గుండెల్లో పదిలంగా ఉన్నారని పేర్కొన్నారు. నేడు ఎందరో త్యాగమూర్తులు అమరులయ్యారని, వారిని స్ఫూర్తిగా తీసుకుని పూర్వ విద్యార్థి నాయకులుగా మన కర్తవ్యాన్ని నిర్దేశించుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు.



సభలో మాట్లాడుతున్న భరద్వాజ

విరసం నాయకులు సీఎస్ఆర్ ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యమంలో ఒడిదుడుకులు వస్తుంటాయని, అంతమాత్రాన అది ముగిసిపోయినట్లు కాదని, ఉద్యమ వారసత్వ పరంపర కొనసాగుతూనే ఉంటుందని అన్నారు. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం నాయకులు వెంకటేశ్వరరావు, డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు ప్రసంగిస్తూ ఆర్ఎస్‌యూ విజయాల్ని మననం చేసుకున్నారు. మధ్యాహ్నం జరిగిన సెషన్‌కి న్యాయవాది సురేష్ అధ్యక్షత వహించారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలుకా చంద్రశేఖర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఖనిజ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టడం కోసం ప్రజలపై యుద్ధం చేస్తోందని విమర్శించారు. ప్రజలకు మద్దతుగా నిలిచిన మావోయిస్టులను, వారితో పాటు అమాయక గిరిజనులను హత్య చేస్తోందని ఆరోపించారు. ప్రజలను అణచివేయడం కోసమే ప్రభుత్వాలు మావోయిస్టులపై దాడి చేస్తున్నాయనే వాస్తవం ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉన్నదని సూచించారు. కార్యక్రమంలో విరసం రాష్ట్ర కార్యదర్శి రివేరా, కార్యవర్గ సభ్యుడు పాణి, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జన నాట్య మండలి కళాకారులు ఆలపించిన విప్లవ గీతాలు ఆకట్టుకున్నాయి.

వైఎస్సార్ సీపీ నేతలపై అక్రమ కేసు

పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలపై పోలీసులు మరో అక్రమ కేసు బనాయించారు. ఈనెల 18వ తేదీన వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సత్తెనపల్లి నియోజకవర్గంలోని రెంటపాళ్ల గ్రామానికి వెళ్లిన విషయం విదితమే. ఈ క్రమంలో పాత గుంటూరు ప్రాంతానికి చెందిన పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, స్వర్ణలత, పార్టీ మహిళా విభాగం నేత గనిక ఝాన్సీలకు ర్యాలీకి వెళ్లేందుకు అనుమతి లేదంటూ ముందుగానే నోటీసులు జారీ చేశారు. దీంతోపాటు ఫోన్ చేసి పోలీసులు వైఎస్ జగన్ పర్యటనకు వెళ్లకూడదంటూ హుకుం జారీ చేశారు. ర్యాలీ రోజు సైతం మహిళలకు ఫోన్ చేసి వెళ్లకూడదు అంటూ ఇబ్బంది పెట్టిన పరిస్థితులు ఉన్నాయి. ఈ క్రమంలో పోలీసులు నోటీసులు ఇస్తామని భయపెట్టిన నేపథ్యంలో ఝాన్సీ, స్వర్ణ వైఎస్ జగన్ ర్యాలీకి వెళ్లలేదు. అయినప్పటికీ పాత గుంటూరులో వీరిద్దరూ ర్యాలీకి వెళ్లినట్లు కేసు నమోదు చేసినట్లు సమాచారం. అయితే, ఈ విషయాన్ని పోలీసులు అత్యంత గోప్యంగా ఉంచుతున్నారు. అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసముండే గనిక ఝాన్సీపై పాత గుంటూరు పోలీసులు కేసు నమోదు చేసిన ఘటనపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కేసు నమోదు చేసి నోటీసులు జారీ చేసేందుకు సదరు మహిళలకు ఫోన్లు చేస్తున్నట్లు తెలిసింది. అయితే, ఈ అంశంపై పాత గుంటూరు పోలీసులను అడిగినప్పటికీ ఎటువంటి సమాచారం చెప్పడం లేదు. ర్యాలీకి రాని వారిపై కేసులు ఎలా నమోదు చేస్తారంటూ వైఎస్సార్ సీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. పోలీసులు ఇటువంటి అక్రమ కేసులు పెట్టడం సబబు కాదని ఆక్షేపిస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నూజెండ్ల: నూజెండ్ల మండలం త్రిపురాపురం గ్రామ సమీపంలోని గుండ్లకమ్మ నదిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన సంఘటన ఆదివారం జరిగింది. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న ఐనవోలు ఎస్సై బీవీ కృష్ణారావు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం కుళ్లిన స్థితిలో ఉండటంతో గుర్తు పట్టలేని విధంగా ఉందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. పోస్టుమార్టం అనంతరం వివరాలు అందజేస్తామని ఆయన తెలిపారు. మృతుని వయస్సు సుమారు 35 నుంచి 40 సంవత్సరాలలోపు ఉండొచ్చని పేర్కొన్నారు. నడుముకు రాయి కట్టి ఉండటాన్ని బట్టి హత్య జరిగి ఉంటుందేమోనని ఆయన అనుమానం వ్యక్తం చేశారు.

సైక్లింగ్ చాంపియన్ షిప్ నిర్వహణ అభినందనీయం

పంజాబ్, కేరళ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి క్రీడాకారుల రాక

చీరాల: నియోజకవర్గంలో మొదటిసారిగా చీరాల సైక్లింగ్ చాంపియన్ షిప్–2025 పోటీలను ఆదివారం ప్రారంభించారు. వాడరేవు నుంచి ప్రారంభించిన ఈ పోటీలను ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్య జెండా ఊపి ప్రారంభించారు. పోటీలను 60 కిమీ, 20 కిమీల విభాగంలో నిర్వహించారు. పంజాబ్, కేరళ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తమిళనాడు, తెలంగాణా, ఏపీ రాష్ట్రాల నుంచి సైక్లింగ్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన విజేతలకు నగదు బహుమతులు, మెమెంటోలను ఎమ్మెల్యే కొండయ్య, బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మలు అందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమారులు, నాయకులు పాల్గొన్నారు. 60 కిమీ విభాగంలో విజేతలు సిద్ధార్థ్ లింగ్ (కర్ణాటక) రూ.లక్ష, అర్షద్ ఫరీద్ (ఢిల్లీ) రూ.50 వేలు, నవీన్ కర్ణాటక రూ.30 వేలు, 20 కిమీల విజేతలు ఎస్.అబ్రహాం (తమిళనాడు) రూ.50 వేలు, రాజు పాండీ (తమిళనాడు) రూ.30 వేలు, సోహెల్ రియాజ్ (మహారాష్ట్ర) రూ.20 వేలు బహుమతులు గెలుచుకున్నారు. చీరాల వన్‌టౌన్, రూరల్ సీఐలు ఎస్. సుబ్బారావు, పి. శేషగిరిరావు, ఎస్సైలు ఎ.చంద్రశేఖర్, పి. జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న చీరాల, బాపట్ల ఎమ్మెల్యేలు కొండయ్య, నరేంద్రవర్మ

వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడి

అమరావతి: వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై కూటమి నేతలు రెచ్చిపోతున్నారు. మండలంలోని నరుకుల్లపాడులో ఆదివారం వైఎస్సార్ సీపీ కార్యకర్తపై దాడికి పాల్పడ్డారు. వివరాలు.. మండలంలోని నరుకుళ్లపాడుకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు నల్లిబోయిన వినోద్ గుంటూరులోనూ, బోదా గోపి సుద్దపల్లిలోనూ గత ఏడాదిగా తలదాచుకుంటున్నారు. శనివారం మధ్యాహ్నం కుటుంబ సభ్యులను కలిసి మాట్లాడి వెళ్లారు. ఈ సమాచారం తెలుసుకున్న టీడీపీ కార్యకర్తలు వెంకటేశ్వర్లు, తిరుపతిరావు, సీతారామయ్య మరి కొంత మంది కలసి నల్లిబోయిన వెంకటసుబ్బారావు, పెదవీరబాబు, చినవీరబాబు ఇంటి మీద దాడికి వెళ్లారు. మధ్యాహ్నమే వినోద్, గోపీలు వెళ్లిపోయారని తెలుసుకుని వారి కుటుంబ సభ్యులతో వాగ్వాదానికి దిగారు. సమాచారం అందుకుని పోలీసులు రావటంతో గొడవ సద్దుమణిగింది. ముందు జాగ్రత్త చర్యగా సీఐ అచ్చియ్య శనివారం రాత్రి పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం వైఎస్సార్ సీపీకి చెందిన బొంతా శ్రీను, ఇంటి ముందు కూర్చుని పేపర్ చదువుకుంటుండగా టీడీపీ చెందిన చింకా వెంకటేశ్వర్లు కర్రతో దాడి చేయగా అతని ఎడమ చేతికి గాయమై అమరావతి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనలో ఇరువర్గాలను బైండోవర్ చేసినట్లు సీఐ అచ్చియ్య తెలిపారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుదుతున్న బొంతా శ్రీను

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

దాచేపల్లి: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన శనివారం రాత్రి జరిగింది. దాచేపల్లి మండలం తంగెడ గ్రామానికి చెందిన వంగూరు మరియదాసు కుమారుడు యశ్వంత్(18) ఈ దుర్ఘటనలో మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యశ్వంత్ ఇంటర్మీడియట్ పూర్తి చేసుకొని నీట్ ప్రవేశ పరీక్ష రాసి ఉన్నత చదువుల కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి అతను ఇద్దరు స్నేహితులతో కలిసి వాహనంపై దాచేపల్లి వచ్చారు. తిరిగి ఇంటికి వెళుతున్న క్రమంలో దాచేపల్లి సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి ముందుగా కట్టెల లోడుతో వస్తున్న ఎద్దుల బండిని బలంగా ఢీకొట్టారు. ఈ ఘటనలో యశ్వంత్ కడుపులోకి కట్టె దిగబడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. మరో ఇద్దరు కూడా తీవ్రంగా గాయపడ్డారు. యశ్వంత్‌ని వైద్యం కోసం నరసరావుపేట తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం అనంతరం యశ్వంత్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. చదువులో చక్కగా రాణిస్తూ కుటుంబానికి అండగా ఉన్న యశ్వంత్ మృతితో తంగెడ గ్రామంలో విషాద ఛాయలు అమ్ముకున్నాయి. చేతికి అందివచ్చిన కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు విలపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. యశ్వంత్ మృతదేహాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ మండపాటి రమేష్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు.



వంగూరి యశ్వంత్ (ఫైల్)

గీత కార్మికుల సమస్యలపై దృష్టిసారిస్తాం

ఏపీ గీత కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి



నిజాంపట్నం: గీత కార్మికుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారిస్తుందని ఏపీ గీత కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి అన్నారు. మండలంలోని కళ్లిఫలం గ్రామంలో ఆదివారం ఆయన పర్యటించి గీత కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళటం జరుగుతుందన్నారు. గీత కార్మికుల ఉత్పత్తులను గుర్తింపు తీసుకువస్తామని పేర్కొన్నారు. తాటి కల్లు నుంచి తాటి బెల్లం తయారీ విధానాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో న్యాయవాది సుభాషిణి, టీడీపీ నాయకులు అనగాని శివప్రసాద్, కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ పంతాని మురళీధర రావు, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు ప్రాచీనతకు దర్పణం 'వ్యాస మంజూష'

- సందడిగా పుస్తకావిష్కరణ
- రచయిత సత్యనారాయణకు సత్కారం

అద్దంకి: తెలుగు సాహిత్యంలోని ప్రాచీనతను తెలియజేస్తూ దాన్ని నూతన దృక్పథంతో ఆవిష్కరించిన పుస్తకమే 'వ్యాస మంజూష' అని సాహితీవేత్త, శతావధాని నారాయణం బాలసుబ్రహ్మణ్యం అన్నారు. డీవీఎం సత్యనారాయణ రచించిన 'వ్యాస మంజూష' పుస్తక పరిచయ సభ పుట్టంరాజు కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించారు. ఈ సభా కార్యక్రమానికి సాహితీవేత్త మోటుపల్లి రామదాసు అధ్యక్షత వహించారు. ప్రముఖ సాహితీ విమర్శకుడు నారాయణం బాలసుబ్రహ్మణ్యం 'వ్యాస మంజూష'లోని ప్రత్యేకతలను సభకు వివరించారు. గాడేపల్లి దివాకరదత్తు, ఆర్వీ రాఘవరావు, జాగర్లమూడి ప్రతాప్ వంటి సాహితీ ప్రియులు తమ లఘు పరిచయాలతో పుస్తకంలోని విశేషాలను వివరించారు. శ్రీనాథుని కనకాభిషేక విశేషాల నుంచి 'పాయసమెరుక' చర్చకు అన్న పద్యం వరకు వీనుల విందుగా చదివి వివరించారు. ఈ గ్రంథంలో శ్రీనాథుని ప్రాచీన కవిత్వాన్ని అత్యంత లోతుగా అధ్యయనం చేసిన రచయిత, శ్రీనాథ–పోతనల సాహితీ బంధాన్ని విశ్లేషించారని సాహితీవేత్తలు ప్రశంసించారు.

రచయిత సత్యనారాయణ కవిత్వం ఆలోచింపజేస్తుంది

శ్రీనాథుని రచనలలో ప్రత్యక్షమైన ఆంధ్ర వంటకాల ప్రస్తావన, అల్లసాని పెద్దన, మొల్ల, గురజాడ, విశ్వనాథ, త్యాగయ్య, అన్నమయ్య వంటి కవుల విశేషాల గురించి రచయిత చేసిన ప్రయత్నం పాఠకులను ఆకట్టుకునేలా ఉందని సాహితీవేత్తలు కొనియాడారు. డీవీఎం సత్యనారాయణ వాచో విధేయత, నిత్య పరిశీలన, వినయ శీలత, ప్రజాకర్షణ పటిమలు ఆయనను ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఖ్యాతిని సాధించే సాహితీశిఖరంగా తీర్చిదిద్దగలవని వక్తలు ప్రశంసించారు. సభ అనంతరం పుట్టంరాజు బుల్లెయ్య–రామలక్ష్మమ్మల ట్రస్టు తరఫున శ్రీరామచంద్రమూర్తి, శైలజ రచయితను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సాహితీ కౌముది అధ్యక్షుడు వారణాసి రఘురామశర్మ, కార్యదర్శి కేవీ పోలిరెడ్డి, కోశాధికారి చుండూరి మురళీసుధాకర రావు, నిమ్మరాజు నాగేశ్వరరావు, పాటిబండ్ల శ్రీమన్నారాయణ, గోగులమూడి శేషగిరి, ఆర్టిస్టు బాలు, పీసీ హెచ్ కోటయ్య, కె. రామమోహన రావు ఎ.యోగయ్య, మలాది శ్రీనివాసరావు, చప్పిడి వీరయ్య, మక్కెన వెంకటేశ్వర్లు, వినుకొండ సుధాకర్, అళహరి హరిప్రసాద్‌బాబు, కందికట్టి సత్యనారాయణ, పెండ్యాల అంకయ్య, కేఎస్ఆర్ కోటేశ్వరరావు, పుట్టంరాజు సాయి కుమార్, బాచిన పూర్ణచంద్రరావు, కూరపాటి రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



డీవీఎం సత్యనారాయణను సత్కరిస్తున్న శ్రీరామచంద్రమూర్తి దంపతులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

రెంటచింతల: రెంటచింతల గ్రామ సమీపంలోని గొట్టిముక్కల మేజర్ కాలువ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానిక ఆంజనేయస్వామి మాన్యం కాలనీకి చెందిన దేవరకొండ నాసరయ్య నర్సరీ పనులు ముగించుకుని నడుచుకుంటూ ఇంటికి వస్తుండగా దుర్గి మండలం ఓబులేశునిపల్లెకు చెందిన గాజుల ఆంజనేయులు ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వెళ్తూ బలంగా ఢీకొట్టడంతో ఇద్దరు రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డారు. నాసరయ్యకు ఎడమకాలు విరిగింది. ఆంజనేయులుకు తల, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను వెంటనే 108 ద్వారా గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



గాయపడిన దేవరకొండ నాసరయ్య



గాజుల ఆంజనేయులు

సీఎం కార్యాలయం నుంచి అక్షింతలతో నాయకుల్లో చలనం

మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి



మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి

పిడుగురాళ్ల: వైఎస్సార్ వైద్యశాల, కళాశాల నిర్మాణ పనులు పూర్తి చేయాలని చేపట్టిన సెల్ఫీ వీడియో ఉద్యమంతో సీఎం పేషీ నుంచి అక్షింతలు పడడంతో స్థానిక నాయకుల్లో చలనం వచ్చిందని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఓ వీడియోను విడుదల చేశారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో తాను చేపట్టిన సెల్ఫీ వీడియో ఉద్యమంతో సీఎం కార్యాలయం నుంచి అక్షింతలు పడటం వలనే స్థానిక ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మొట్టమొదటిసారిగా గత ప్రభుత్వంలో చేపట్టిన వైఎస్సార్ వైద్యశాల, కళాశాలను పరిశీలించినట్లు చెప్పారు. అయితే మెడికల్ కాలేజీ 2019 జనవరి 20న మంజూరు అయిందని శ్రీనివాసరావు చెబుతున్నారని, కనీసం పేపర్ చూసి కూడా చదవలేకపోతే ఎలా ? అని ప్రశ్నించారు. మొన్నటి వరకు రాయపాటి శ్రీనివాస్ మంజూరు చేయించాడని చెప్పుకొచ్చారని ఎద్దేవా చేశారు. మెడికల్ కాలేజీ మీద అవగాహన లేకపోవడం హాస్యాస్పదం అన్నారు.

మూడేళ్లలో 70శాతం పనులు

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే 20 మార్చి 2020లో పిడుగురాళ్ల, పాడేరు, మచిలీపట్నం కేంద్ర ప్రభుత్వం నిధులతో మంజూరు చేసినట్లు వివరించారు. 2020 జనవరిలో కరోనా వచ్చిందని, 2021 కరోనా వలన పనులు చేపట్టలేకపోగా, మిగిలిన మూడేళ్లలోనే మెడికల్ కాలేజీ 60 నుంచి 70 శాతం పనులు పూర్తి చేశామన్నారు. హాస్పటల్‌ను 90 శాతం పూర్తి చేశామని కాసు మహేష్‌రెడ్డి పేర్కొన్నారు. ఏది ఏమైనా ప్రతిపక్షమా, పాలకపక్షమా కాకుండా ప్రజల పక్షాన ఉండి పోరాటం చేస్తామని కాసు పేర్కొన్నారు.